## క్లుప్తంగా

### నేడు కురుపాంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

**కురుపాం:** కురుపాం నియోజకవర్గ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్టు పంచాయతీ విస్తరణాధికారి కె.చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో వైద్యాధికారులు, స్పెషలిస్టు వైద్యులు హాజరు కానున్నారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

**కొమరాడ:** మండలంలోని కూనేరు రామభద్రపురం ఇసుక రీచ్ నుంచి నకిలీ వే బిల్లులతో వెళ్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపాలకృష్ణ చెప్పారు. గురువారం ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఈ నేపథ్యంలో రహదారిపై వెళ్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లు ఆపి వారి వద్ద ఉన్న రవాణా అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో వారి వద్ద ఉన్న ఓ కంపెనీ పేరు ఉన్న వే బిల్లులను స్వాధీనం చేసుకుని ట్రాక్టర్లు కొమరాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు.

### ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**భామిని:** మండలంలోని కాట్రగడ–బీలో గురువారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తోట సింహాచలం, సచివాలయ కన్వీనర్ తోట లాల్, కార్యదర్శి కలిశెట్టి సంతోష్ పర్యవేక్షణలో వీధుల్లో చెత్తను జేసీబీలతో తీయించి ట్రాక్టర్లతో పొలాలకు తరలించారు. రానున్న కార్తీక మాసం పవిత్ర స్నానాలకు, పూజలకు అనుకూలంగా వంశధార నది వరకు పారిశుద్ధ్య పనులు కొనసాగించడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### అన్న సమారాధనకు పోటెత్తిన భక్తులు



అమ్మవారి ప్రసాదం కోసం బారులు తీరిన భక్తులు

**వీరఘట్టం:** దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక కోటదుర్గతల్లి ఆలయ ఆవరణలో యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు పోటెత్తారు. వీరఘట్టం మండల నలుమూలల నుంచి వచ్చిన సుమారు 15 వేల మంది 9 రకాల వంటకాలతో అన్నసంతర్పణ నిర్వహించారు.

### అర్హులైన వారందరికీ ఓటుహక్కు

**సీతానగరం:** మండలంలో అర్హులైన వారందరికీ ఓటుహక్కు కల్పించడానికి, ఓటర్ల జాబితాలో పేరుండి మృతి చెందిన వారి పేర్లు తొలగించి కచ్చితమైన ఓటర్ల జాబితాను తయారుచేయడం కోసం చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ ఎన్వీ రమణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఓటర్ల జాబితాకు సంబంధించి డ్రాఫ్ట్ పబ్లికేషన్ జరుగుతుందని మండలంలోని 62 పోలింగ్ కేంద్రాలవద్ద బీఎల్వోలు జాబితాలను ఉంచుతారని చెప్పారు. ప్రతి బీఎల్వో నిర్దేశించిన డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ విషయంపై గ్రామసభ నిర్వహించి జాబితాను ప్రజలకు చదివి వినిపిస్తారన్నారు. ఇప్పటికే మృతి చెందినవారు, శాశ్వతంగా గ్రామాంతరం వెళ్లిపోయిన వారిని ఫారం–7 ద్వారా తొలగించనున్నామని చెప్పారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన వారిని ఎన్‌రోల్ చేసి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. ఓటర్ల తొలగింపు, చేర్పుల విషయమై ప్రజలకు బీఎల్వోలు అవగాహన కల్పించాలని సూచించినట్లు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నామని బీఎల్వోలంతా హాజరు కావాలని కోరారు.

### ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి

**సీతానగరం:** మండలకేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానఅర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ముడుపులు చెల్లించడంతో పాటు, క్షీరాభిషేకం చేశారు. స్వామి దర్శనానికి దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

### కామాక్షమ్మ ఆలయంలో అన్న సమారాధన

**సాలూరు:** పట్టణంలోని కామాక్షమ్మ ఆలయంలో గురువారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రులు ముగిసిన సందర్భంగా ఆలయంలో అన్నసమారాధన చేపట్టగా వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. .



వీరఘట్టం: నడుకూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మెడికల్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ దమలపాటి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లీలాప్రసాదరావు

## ● ప్రజారోగ్యమే లక్ష్యంగా వైద్య శిబిరాలు

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందిస్తుందని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు వైద్య సిబ్బంది అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పాలకొండ రూరల్: వాటపాగులో జగనన్న ఆరోగ్య సురక్షలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎంపీపీ భాను, సర్పంచ్ రాజారావు తదితరులు



గుమ్మలక్ష్మీపురం: జేకేపాడు కాలనీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో ప్రజలకు వైద్య సేవలు



సీతంపేట: పుబ్బాడలో జరిగిన వైద్య శిబిరంలో రోగుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు



కొమరాడ: కళ్లికోటలోని వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు



జియ్యమ్మవలస: అంకవరంలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా రోగులకు సూచనలు చేస్తున్న వైద్య సిబ్బంది

## పోలీసు అమరవీరుల త్యాగాలు మరువరాదు



విద్యార్థులకు పోలీస్ అమరవీరుల త్యాగాలను వివరిస్తున్న ఎస్ఐ

**గుమ్మలక్ష్మీపురం:** విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేమని ఎల్విన్‌పేట ఎస్ఐ ఎస్.షన్ముఖరావు అన్నారు. పోలీస్ అమరవీరులసంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన వ్యాస రచన మరియు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల ప్రధాన కర్తవ్యమని, దయ, సహనం, భయం లేదా పక్షపాతం, ఇతరుల హక్కుల పట్ల పక్షపాతం లేకుండా ప్రవర్తించే పోలీసులను స్ఫూర్తిగా తీసుకొని శాంతిభద్రతల పరిరక్షణకు విద్యార్థులంతా తోడ్పాటునందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం బిడ్డిక భీముడు, ఉపాధ్యాయులు ఎం.సీతన్న, మురళీధర్ పాల్గొన్నారు.

**అమరవీరుల సేవలు శ్లాఘనీయం**

**పాలకొండ రూరల్:** పోలీసు అమరవీరుల సేవలు శ్లాఘనీయమని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్ఐ శివప్రసాద్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సత్యసాయి పాఠశాలలో బాలల హక్కులు, హ్యూమన్ ట్రాఫికింగ్‌పై, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



వ్యాసరచన పోటీలు పర్యవేక్షిస్తున్న ఎస్ఐ శివప్రసాద్

## టూరిజం హాస్పిటాలిటీ సెక్టార్‌లో ఉపాధి శిక్షణ

**సీతంపేట:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తున్న స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లెడ్ న్యూట్రీషియన్ కోర్సులో ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెస్టారెంట్ కెప్టెన్ మూడు నెలల కోర్సుకు ఇంటర్మీడియెట్/ఐటీఐ కోర్సు పాసై ఉండాలన్నారు. వయస్సు 18 – 28 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. మొత్తం 30 మందికి శిక్షణ ఇస్తారన్నారు. అర్హత సాధించిన వారికి స్కిల్ ఇండియా సర్టిఫికేట్, ప్రముఖ హోటల్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## 30న ప్రజా రక్షణ భేరి సభ

**కురుపాం:** సీపీఎం ఈ నెల 30న చేపట్టిన ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి వేణు అన్నారు. కురుపాంలో సీపీఎం పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రజా రక్షణ భేరికు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అలాగే వారపు సంత ప్రదేశంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 30న ప్రజా రక్షణ భేరి పేరుతో నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరౌతారన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలు అమలు చేయడం లేదని, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్ పెట్టుబడిదారులకు అమ్ముతున్నారని, విద్య, వైద్యం ప్రైవేటీకరణ చేశారని ఈ సమస్యలపై ప్రశ్నించేందుకు ప్రజా రక్షణ భేరి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోలక అవినాష్, కొల్లి గంగునాయుడు, ఎం.శ్రీనివాసరావు, కోరంగి సీతారం తదితరులు ఉన్నారు.



ప్రజా రక్షణ భేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

**పోస్టర్ల ఆవిష్కరణ**

**పాలకొండ రూరల్:** లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ అసమానతలు లేని అభివృద్ధి కోరుతూ ప్రజా రక్షణ భేరి పేరిట సీపీఎం నేతృత్వంలో బస్సు యాత్ర తలపెట్టినట్టు ఆ పార్టీ నాయకులు దావాల రమణారావు తెలిపారు. గురువారం యాత్రకు సంబంధించిన పోస్టర్లను పాలకొండలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబర్ 30న కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల సభలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

## విద్యారంగానికి పెద్దపీట

**పాలకొండ రూరల్:** విద్యా రంగానికి జగనన్న ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణకు సర్కారు సమకూర్చిన నూతన వంట పాత్రలను నిర్వాహకులకు గురువారం అందించారు. మండలంలోని తంపటాపల్లి పాఠశాలను ఎంఈఓ–2 కె.సోంబాబుతో కలసి సందర్శించారు. అక్కడ విద్యార్థులకు అందుతున్న బోధనపై ఆరా తీసారు. మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎండీఎం సిబ్బందికి నూతన వంట పాత్రలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం గోవిందరాజులు పాల్గొన్నారు.



తంపటాపల్లి ప్రభుత్వ పాఠశాలలో సిబ్బందికి వంట పాత్రలు అందిస్తున్న ఎంపీపీ, ఎంఈఓ

## విజిలెన్స్ అధికారుల తనిఖీలు

**పాలకొండ రూరల్:** పట్టణంలో పోరంబోకు భూముల ఆక్రమణలపై అందిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్ నేతృత్వంలో అధికారులు గురువారం పాలకొండ పట్టణంలో పర్యటించారు. ఫిర్యాదుదారు నానాజీరావు సమక్షంలో రెవెన్యూ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, మండల సర్వేయర్ పి.వెంకటరావు, వీఆర్వోలు బి.సాయి శ్రీనివాస్, జయప్రద తదితరులతో కలసి పలు పోరంబోకు స్థలాలను పరిశీలించారు. తాము సేకరించిన వివరాల నివేదికను తమ శాఖ ఉన్నతాధికారులకు అందిస్తామని విజిలెన్స్ సీఐ తెలిపారు.



పట్టణ పరిధిలో పోరంబోకు స్థలాల వివరాలు రెవెన్యూ అధికారుల నుంచి సేకరిస్తున్న విజిలెన్స్ సీఐ

### సప్తధాన్య అంకుర కషాయం తయారీ



ద్రావణం తయారీకి సేకరించిన ముడిసరుకు

**బలిజిపేట:** సప్తధాన్య అంకుర కషాయం తయారుచేయడంపై మండల కేంద్రంలోని రైతులకు ఎంసీఆర్‌పీ లక్ష్మి గురువారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ ద్రావణం తయారీకి 7రకాల ద్విదళ గింజలు పెసలు, మినుములు, కందులు వంటివి 100గ్రాముల వంతున తీసుకుని 12గంటలు నానబెట్టి తర్వాత వస్త్రంలో మూటకట్టి మొలకలు వచ్చిన తరువాత వాటిని మెత్తగా పేస్ట్‌లా చేసి 200లీటర్ల గోమూత్రంలో కలిపి 24గంటలు పులియబెట్టాలని తెలిపారు. దీనిని వరిచేనుకు కొట్టడం వల్ల గింజ బరువుతో పాటు రంగు నాణ్యత పెరుగుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఈ ద్రావణాన్ని తయారుచేసుకోవడం ఎంతో మంచిదని హితవు పలికారు. కార్యక్రమంలో రైతు బి.సత్యనారాయణ మూర్తి, ఐసీఆర్‌పీ తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

### ఎస్ఈఏఎస్ పరీక్షను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంఈఓ సామల

**బలిజిపేట:** వచ్చేనెల 3వ తేదీన 19పాఠశాలల్లో నిర్వహించనున్న ఎస్ఈఏఎస్ పరీక్షను విజయవంతం చేయాలని ఎంఈఓ సామల సింహాచలం కోరారు. ఈ మేరకు బలిజిపేట ఎంఈఓ కార్యాలయంలో ఎస్ఈఏఎస్ ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్, సంబంధిత ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర విద్యాసాధన సర్వే పరీక్షను వచ్చేనెల 3వ తేదీన 19పాఠశాలల్లో నిర్వహిస్తున్నామన్నారు. మూడు, ఆరు, తొమ్మిదవ తరగతులకు చెందిన సుమారు 700మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతారని తెలిపారు. పరీక్ష నిర్వహణకు 36మంది డిగ్రీ ఇంజినీరింగ్, బీఈడీ తదితర అర్హతలు కలిగిన అభ్యర్థులను నియమించనున్నట్లు చెప్పారు. ప్రాక్టీస్ పేపర్లు విద్యార్థులతో చేయించేందుకు ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు పాల్గొన్నారు.

### పనుల గుర్తింపుపై అవగాహన

**బలిజిపేట:** 2024–25ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధిపనుల గుర్తింపునకు గ్రామాల్లో చిత్రాల ద్వారా సిబ్బంది అవగాహన కల్పించారు. అందులో భాగంగా ఏపీఓ కేశవరావు గురువారం పదమాయవలసలో సూచనలు ఇస్తూ పంచాయతీలలో అవసరమైన పనులు గుర్తించాలని తెలిపారు. రైతులు, ప్రజలకు పనుల గురించి వివరించారు. ఏఏ రకాల పనులకు అనుమతులు లభిస్తాయో చెప్పారు. గ్రామానికి ఉపయోగపడే పనులను ప్రణాళికలో పెట్టుకోవాలని సూచించారు.

### భక్తిశ్రద్ధలతో జై గురుదత్త హోమాలు



గురుదత్త హోమంలో పాల్గొన్న భక్తులు

**గరుగుబిల్లి:** మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం జైగురుదత్త హోమం పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దేవీ సహిత జై గురుదత్త హోమాలను నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఆక్రమణల గుర్తింపు

**భామిని:** మండలంలోని బత్తిలి మేజర్ పంచాయతీ బస్టాండ్ కూడలిలో రోడ్డుకు ఇరువైపుల ఆక్రమణలను మండల మోనిటరింగ్ అధికారులు గురువారం గుర్తించారు. తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఆర్అండ్‌బీ ఏఈ జగన్నాధరాజు, బత్తిలి ఎస్ఐ యతిరాజుల అమ్మానరావు ఆధ్వర్యంలో ఆక్రమణలను గుర్తించారు. ఎంపీటీసీ టింగ అన్నాజీరావు సారథ్యంలో ఏబీ రోడ్డుకు ఇరువైపుల కొలతలు కొలిచి ఆక్రమణలకు రెడ్ మార్కులు వేసి ఆక్రమణదారులకు హెచ్చరించారు. ఎంపీడీఓ జి.చంద్రరావు, ఏఎస్ఐ గురుమూర్తి ఉన్నారు.



బత్తిలి బస్టాండ్‌లో కొలతలు వేస్తున్న మోనిటరింగ్ అధికారులు

## ఉద్యానవన పంటల సాగుకు రాయితీ

**కొమరాడ:** ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కళ్లికోట గ్రామంలో రైతులతో కలసి గురువారం గ్రామసభ నిర్వహించారు. అనంతరం ఈ క్రాప్‌కు సంబంధించి జాబితాను సచివాలయంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా ప్రతి పంటకు ఈ క్రాప్ చేయించుకోవాలని సూచించారు. ఈ క్రాప్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సర్పంచ్ దత్తి మురళీకృష్ణ, వ్యవసాయ సహాయకులు వెంకటి, సాయి పలువురు రైతులు పాల్గొన్నారు.



కళ్లకోటలో ఈ క్రాప్ జాబితాను ప్రదర్శిస్తున్న ఉద్యానవన శాఖాధికారి సత్యానారాయణరెడ్డి

## 31న కోరన్న, మంగన్న సంస్మరణ సభ

**గుమ్మలక్ష్మీపురం:** శ్రీకాకుళం రైతాంగ పోరాట ఉద్యమంలో అసువులు బాసిన కామ్రేడ్లు కోరన్న, మంగన్నల వర్ధంతి సందర్భంగా ఈ నెల 31న గుమ్మలక్ష్మీపురం బీఎస్ఆర్ కళింగ వైశ్య కల్యాణ మండపం వద్ద వారి సంస్మరణ సభను నిర్వహించనున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి తోట జీవన్న, కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, కొండంగి లింగరాజు తెలిపారు. ఈ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు స్థానికంగా గురువారం విడుదల చేశారు. సంస్మరణసభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## అధికారులు స్పందించాలి

**పాలకొండ రూరల్:** మండల వ్యాప్తంగా వరి పంటలో అధిక శాతం పొట్ట దశకు చేరుకుందని, ఈ తరుణంలో సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని, సాగునీరు అందించే విషయమై అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు. తోటపల్లి కాలువలు వర్షాధారమైన శివారు ప్రాంతాలకు నీరు అందకపోవడంతో ఆందోళన నెలకొందని వారు పేర్కొన్నారు. ఈ సమయంలో లుంబూరు, గరుగుబిల్లి పాలకొండ రైతులు ఇరిగేషన్ కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు నడుం కట్టారు. గతంలో పలుమార్లు సంబంధిత అధికారులకు తమ సమస్య విన్నవించినా వారి నుంచి ఆశించిన ఫలితం రాలేదని, దీంతో తామే శ్రమదానంతో వ్యర్థాలను తొలగిస్తున్నట్టు రైతులు తెలిపారు. కాలువల్లో నీరు శివారు భూములకు వచ్చేలా సహకరించాలని కోరారు. ఎం.సింగుపురం, మల్లివీడు, బాసూరు తదితర గ్రామాలను కలుపుతూ వస్తున్న తోటపల్లి ఏడో బ్రాంచి కాలువల్లో పూడికలు తొలగించారు.



ఎం.సింగుపురం వద్ద కాలువల్లో పూడికలు తొలగిస్తున్న పాలకొండ, గరుగుబిల్లి రైతులు

## నేడు స్వామివారి శ్రీచక్ర స్నానం

**గరుగుబిల్లి:** పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం పవిత్ర నాగావళి నదీ తీరంలో స్వామివారికి శ్రీచక్ర స్నానం కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ మర్రాపు సత్యన్నారాయణ, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఈఓ బీఎల్ నగేష్ గురువారం తెలిపారు. తోటపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలను, అర్చనలను నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం స్వామి వారిని తిరువీధి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికంగా పాల్గొన్నారు.



పూజలు అందుకుంటున్న శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లు

### కొండకు తరలిన భవానీ భక్తులు

**భామిని:** బత్తిలి కోటదుర్గమ్మ సన్నిధిలో భవానీ దీక్ష తీసుకొన్న భవానీలు విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో మొక్కులు తీర్చుకొనడానికి గురువారం తరలివెళ్లారు. ముందుగా కోటదుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించి తరలివెళ్లారు. కుటుంబ సభ్యులు వెంట వచ్చి సాగనంపారు.